# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-09-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు ఈ రోజు నుంచి ప్రారంభంకానున్నాయి**

2. **ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**

3. **భవిష్యత్తు అవసరాలకు తగినట్లుగా తెలంగాణ విద్యా విధానం ఉండాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు.**

4. **ఆంధ్రప్రదేశ్ లోని ప్రభుత్వ కార్యాలయాల్లో అక్టోబర్ 2 నుంచి ప్లాస్టిక్ నిషేధిస్తామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**

5. **వెదురు చెట్ల ఆవశ్యకతను తెలియజేస్తూ ఈ రోజు ప్రపంచ వెదురు దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

=========================

ఆంధ్రప్రదేశ్ శాసనసభ వర్షాకాల సమావేశాలు ఈ రోజు నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ ఉదయం 9 గంటలకు శాసనసభ సమావేశాలు, ఉదయం 10 గంటలకు శాసన మండలి సమావేశాలు ప్రారంభమవుతాయి. మొదటి రోజు సమావేశం తర్వాత.. శాసనసభ వ్యవహారాల సలహా కమిటీ బీఏసీ సమావేశం జరుగుతుంది. ఈ బీఏసీ సమావేశంలో శాసనసభ సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాలనే అంశాలపై నిర్ణయం తీసుకుంటారు. మరోవైపు శాసనసభ సమావేశాల నిర్వహణపై సభాపతి సిహెచ్ అయ్యనపాత్రుడు నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

వాయిస్ 22 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. విశాఖపట్నంలో భారత పరిశ్రమల సమాఖ్య సీఐఐ–గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ నిర్వహించిన వాణిజ్య సదస్సులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. రాష్ట్రంలో సుదీర్ఘ తీరప్రాంతం, ఓడరేవు ఆధారిత పరిశ్రమల ద్వారా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ,

వాయిస్ 29 సెకన్లు

---------------------------

భవిష్యత్తు అవసరాలకు తగినట్లుగా తెలంగాణ విద్యా విధానం ఉండాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ విద్యా విధానం–టెప్ నివేదిక రూపకల్పనపై అధికారులు, విద్యావేత్తలతో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రాథమిక స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు సమూల మార్పులు రావాల్సిన అవసరం ఉందన్నారు. జ్ఞానం, భాష, నైపుణ్యాలు మూడింటి కలయికగా విద్యను అందించే లక్ష్యంతో రాష్ట్ర విద్యా విధానాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

---------------------------

విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో జరిగే దసరా ఉత్సవాలకు 4 వేల 500 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి వి.అనిత తెలిపారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై మంత్రి నిన్న అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈసారి దసరా ఉత్సవాలకు 15 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వెయ్యికి పైగా సిసి కెమేరాలతో పాటు డ్రోన్లతో దసరా ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నామని, భవానీల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ కార్యాలయాల్లో అక్టోబర్ 2 నుంచి ప్లాస్టిక్ నిషేధిస్తామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవా' అవగాహన కార్యక్రమంలో కార్పొరేషన్ ఛైర్మన్ కె. పట్టాభి రామ్‌తో కలిసి మంత్రి నిన్న పాల్గొన్నారు. రాష్ట్రంలో చెత్తను పూర్తిగా తొలగించేలా, ఏరోజు చెత్త ఆ రోజు తీసివేసేలా వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భంగా నారాయణ తెలియజేస్తూ,..

వాయిస్ 29 సెకన్లు

---------------------------

పర్యావరణ సమతూకాన్ని కాపాడడంతో పాటు కోట్లాది మంది ప్రజలకు జీవనోపాధి కల్పించే వెదురు చెట్ల ఆవశ్యకతను తెలియజేస్తూ ఈ రోజు ప్రపంచ వెదురు దినోత్సవం నిర్వహిస్తున్నారు. 2009 వ సంవత్సరంలో బ్యాంకాక్ లో జరిగిన ప్రపంచ బాంబూ కాంగ్రెస్‌లో అంతర్జాతీయ వెదురు పెంపక పరిరక్షణా సంస్థ చేసిన తీర్మానం మేరకు ప్రతి ఏటా సెప్టెంబర్ 18 వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది.

ప్రపంచ వ్యాప్తంగా అటవీ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వెదురు చెట్లు ప్రధాన ఆదాయ వనరుగా ఉంటున్నాయి. అంతే కాకుండా గిరిజనుల జీవనోపాధికి వెదురు ఎంతగానో ఉపయోగపడుతోంది. వెదురుకు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం వెదురు చెట్ల పెంపకానికి రాయితీ కూడా సమకూరుస్తోంది.

----------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. "సేవా పర్వ్" పేరుతో ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. కేంద్రప్రభుత్వం దేశ వ్యవసాయ రంగాన్ని ఆత్మనిర్భర్‌గా ఎలా మార్చిందో ఇప్పుడు తెలుసుకుందాం.

వాయిస్ ఓవర్ (01 : 25)

----------------------------

చండీగఢ్‌లోని ముల్లాన్‌పూర్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా మహిళా జట్ల మధ్య జరిగిన రెండవ వన్డే క్రికెట్ మ్యాచ్‌లో భారత్ 102 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 49.5 ఓవర్లలో 292 పరుగులకు ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన ఆస్ట్రేలియా 40.5 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌటవ్వడంతో 102 పరుగుల తేడాతో భారత్ గెలుపొందింది.

----------------------------

తూర్పు విదర్భ, తెలంగాణ, దక్షిణ కోస్తాంధ్రప్రదేశ్ మీదుగా ఉపరితల ద్రోణి కొనసాగుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

మరోవైపు తెలంగాణలోనూ ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================